## ఆయిల్‌పాం సాగుపై అవగాహన

కల్వకుర్తి రూరల్, జూన్ 23 : కల్వకుర్తి మండలం మార్చాలలో రైతు వేదికలో కల్వకుర్తి ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు ఆయిల్‌పాం సా గుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హార్టికల్చర్ ఆఫీసర్ ఇమ్రానా ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే అవగాహ న సదస్సుకు జిల్లా ఉద్యానవనశాఖాధికారి, వ్యవసాయశాఖాధికారులు, ఆయిల్ పాం మేనేజర్, ఏఈవోలు హాజరై ఆయిల్ పాం పంట సాగుపై సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు పంట దిగుబడి, పంట ద్వారా లభించే ఆదాయ వనరులు తదితర అంశాలపైన అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్చాల రైతుబంధు సమితి కన్వీనర్ కృష్ణారెడ్డి, అధికారులు కోరారు.

## నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 23 : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు నేటి నుంచి మంగళవారం వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పాలీసెట్ నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్డినేటర్ ఎస్.విద్యారాణి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని బిజినేపల్లి మండలం పాలెంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు రావాలని ఆమె సూచించారు. స్లాట్ బుకింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఈ కేంద్రాన్ని ఎంచుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. విద్యార్థులు పాలీసెట్ ర్యాంక్ కార్డు, హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, పదో తరగతి లేదా సమాన విద్యార్హత క్వాలిఫై సర్టిఫికెట్, నాలుగు నుంచి పదో తరగతి వరకు బోనఫైడ్, టీసీ, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకొని స్లాట్ బుకింగ్‌లో ఇచ్చిన సమయం ప్రకారం వెరిఫికేషన్ కేంద్రానికి వెళ్లాలన్నారు.

## కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, జూన్ 23 : మండల కేంద్రం సమీపంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం ప్రధాన రహదారిపై వెళ్లే ఆయా గ్రామాల ప్రజలకు కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఎస్సై రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలతోపాటు చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గుర్తు తెలియని వారు తమ మొబైల్‌కు బ్యాంక్ ఖాతాకు సంబంధించి ఓటీపీ చెప్పాలంటే వివరాలు ఇవ్వొద్దన్నారు. అలాగే తమ గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విష్ణుమూర్తి ఉన్నారు.

## నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న సభ్యులు

అచ్చంపేట టౌన్, జూన్ 23 : అచ్చంపేట పట్టణంలోని వనవాసీ సేవా ప్రకల్ప బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు ఆదివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన ఆపరేషన్ స్మైల్ టీం సభ్యురాలు మలిపెద్ది శ్రీజ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలను సందర్శించి.. ఆ పాఠశాలకు అనుబంధంగా నడుస్తున్న వనవాసీ సేవా ప్రకల్ప బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్, వెంకటేశ్, భాస్కర్, చంద్రశేఖర్, భానుప్రసాద్, శ్వేషిత, ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెంట్లవెల్లి, జూన్ 23 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో ముసురు వర్షాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ఆశ, ఏఎన్ఎంలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఘనంగా సుబ్బయ్య వర్ధంతి

బిజినేపల్లి, జూన్ 23 : మండలంలోని పాలెంలో గ్రామ నిర్మాత తోటపల్లి సుబ్రమణ్య శర్మ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గ్రామాభివృద్ధి కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లావణ్యా నాగరాజు, హెచ్ఎం దయానంద్‌రావు, రాములు, లక్ష్మారెడ్డి, బాలస్వామి, గోపాల్‌స్వామి తదితరులు ఉన్నారు.

SHRIRAM Finance
వాహనములు అమ్మబడును

| SNo. | VEHICLE NO. | DISCRIPTION | MODEL |
| --- | --- | --- | --- |
| 1 | TS31G-4370 | AL TO VXI BS6 PETROL 6 SEATER | 2021 |

పై వాహనం తేది : 25-06-2024 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ్ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
హౌస్ నెం.20-15/4/A/1, 1వ అంతస్తు, శ్రీ లక్ష్మి నరసింహా స్వామి కాంప్లెక్స్, LIC ఆఫీస్ ప్రక్కన, నాగర్‌కర్నూల్ రోడ్, అచ్చంపేట -509375. నాగర్‌కర్నూల్ జిల్లా. తెలంగాణ రాష్ట్రం. సెల్: 98483 21685

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఉద్యోగ అవకాశం
★NBFC కంపెని నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 15K నుండి 20K వరకు ఇవ్వబడును. సం.ప్ర. 8660148086, 9590125555.
NT-MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794



కూరగాయల దుకాణం

# వెజి'ట్రబుల్స్'

- కూరగాయల ధరలకు రెక్కలు
- బయట ప్రాంతాల నుంచి దిగుమతి
- రూ.100కు చేరిన టమాట
- ఘాటెక్కిన ఉల్లి

అచ్చంపేట టౌన్, జూన్ 23 : కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నా యి. దీంతో మార్కెట్లో కొన్ని రకాల కూరగాయలే లభిస్తున్నాయి. ఇటీవల వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు పండలేదు. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు అధికమవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నా యి. టమాట ధర రోజురోజుకూ పెరుగుతున్నది. నెల కిందట కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.100కు చేరింది. ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉన్నదని వ్యాపారులు చెబుతున్నారు. సరిపడా దిగుబడి లేకపోవడంతో టమాటా రేటు పెరిగిందని వర్తకులు అంటున్నారు. కూరగాయలు ఏవి తీసుకుందామనా రూ.80 నుంచి రూ.100కు పైగానే ఉన్నాయని వాపోతున్నారు.

### ఘాటెక్కుతున్న ఉల్లి..



సీజన్ ప్రకారం చూసుకుంటే ఇప్పటికే రేటు పెరగాలి. అయితే మహారాష్ట్ర మార్కె ట్ నుంచి అవసరమైనంత సరుకు వస్తుండడంతో ధర కొంత అదుపులో ఉన్నది. రవాణా చార్జీలు పెరగడం, వర్షాలు సకాలంలో కురవనందున ధరలు పెరిగాయి. వా రం కింద ఉల్లి ధర కిలో రూ.20 నుంచి రూ.35 ఉన్నది. ప్రస్తుతంరూ.40కి చేరింది.

– పెద్ది రాఘవేందర్, ఉల్లిగడ్డల వ్యాపారస్తుడు, అచ్చంపేట

### గిరాకీ తగ్గింది..



పంటలు పండక ఇతర ప్రాంతాల నుం చి కూరగాయలు తీసుకొస్తున్నరు. అందుకే రేట్లు పెరిగినయ్. ఈ ధరలకు కూరగాయలు కొనని క్కె వినియోగదారులు భయపడుతున్నరు. ఎక్కువ కొంటలేరు అందుకే గిరాకీ తగ్గింది. తెచ్చిన కూరగాయలు అమ్ముడువోక.. ఎక్కువ రోజులు సరుకు నిల్వ ఉండక శానా నష్టపోతున్నం.

– కృష్ణమ్మ, కూరగాయల వ్యాపారి

### ఏం కొనేటట్లు లేదు..



కూరగాయల రేట్లు పెరగడంతో ఏం కొనేటట్లు లేదు. అన్ని రేట్లు ఎక్కువైనయ్. సామాన్యుడు ఏం తినాలన్నా ఇబ్బందిగా మారింది. రూ.500 తీసుకొని మార్కెట్‌కు వచ్చినా.. పట్టుమని పది కూరగాయలు కూడా కొనలేకపోతున్నం. ఇలా అయితే ఎలా బతకాలి. పంటలు పండుతలేవు.. రవాణా చార్జీలు పెరిగినయ్. అందుకే రేట్లు పెరిగినయ్ అని వ్యాపారులు చెబుతున్నరు. ఏదేమైనా సామాన్యులే బలవుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి ధరలు నియంత్రిస్తే బాగుంటుంది.

– కాట్రాజు మాధవి, వినియోగదారురాలు, అచ్చంపేట

## ప్రమోషన్లు ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలి

కల్వకుర్తి, జూన్ 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను ప్రత్యక్షంగా(మాన్యువల్) పద్ధతిలో నిర్వహించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేందర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉన్న స్కూల్ అసిస్టెంట్ స్థాయి అన్ని పోస్టులకు ఎస్‌జీటీల నుంచి నిర్వహించే పదోన్నతులను ప్రత్యక్షంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా నిర్వహించడం వల్ల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంటుందని, అదే ఆన్లైన్ విధానం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తే సీనియార్టీ లిస్ట్‌లో ఉన్న అర్హత ఉన్న అభ్యర్థికి అనేక సబ్జెక్టుల్లో పదోన్నతి పొందే అవకాశం ఉంటుంది. దీని ద్వారా ఎన్నో సంవత్సరాల నుంచి పదోన్నతి కొసం ఎదురుచూస్తున్న సీనియార్టీలో వెనుక ఉన్న ఉపాధ్యాయులకు తీరని నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ద్వారా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి స్థాయిలో లోపభూయిష్టమైందన్నారు. ప్రత్యక్షంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడితే అందరికి పూర్తి స్థాయిలో న్యాయం చేకూరుతుందని పేర్కొన్నారు.

**ఉప్పునుంతలలో..**

ఉప్పునుంతల, జూన్ 23 : ఎస్జీటీల ప్రమోషన్లు ప్రత్యేక పద్ధతిలో నిర్వహించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిదేండ్ల తర్వాత చేపడుతున్న టీచర్ల పదోన్నతుల్లో సెకండరీ గ్రేడ్, తత్సమాన ఉపాధ్యాయులు.. స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందేటప్పుడు ఒకటి కన్నా ఎక్కువ సబ్జెక్టుల్లో ప్రమోషన్ పొందుటకు అర్హత ఉన్న ఉపాధ్యాయులకు మల్టీజోన్ -1లో వారి అర్హతను బట్టి ఒకటి కన్నా ఎక్కువ ప్రమోషన్ ఆర్డర్స్ వచ్చాయన్నారు. వారు ఒకే సబ్జెక్టును ఎంచుకున్న కారణంగా తదుపరి సీనియార్టీలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్ రాకుండా కొన్ని ఖాళీలు అలాగే మిగిలిపోతున్నాయన్నారు. ప్రస్తుతం మల్టీజోన్-2లో రెండు, మూడు రోజుల్లో ఎస్జీటీల పదోన్నతులు ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఇక్కడ ఒకటి కన్నా ఎక్కువ సబ్జెక్టుల్లో ప్రమోషన్ పొందే వారికి ఈ పరిస్థితి రాకుండా సబ్జెక్టు వారీగా సమయాన్ని కేటాయించి ప్రమోషన్ ఇస్తే ఒక ఉపాధ్యాయుడు ఒకే సబ్జెక్టును ఎంచుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఫలితంగా తదుపరి సీనియారిటీ లిస్టులో ఉన్న ఉపాధ్యాయులకు కూడా ప్రమోషన్స్ రావడం వల్ల ఖాళీలు భర్తీ అవుతాయన్నారు. ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక పద్ధతిలో లేదా ఆన్‌లైన్‌లో అయితే సబ్జెక్టు వారీగా సమయాన్ని కేటాయించి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## శ్యామ్‌ప్రసాద్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 23 : అఖండ భారత్ కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డ, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రమోద్, జాకీర్ హుస్సేన్, చందు, రోహిత్, శివారెడ్డి, యాదగిరిరావు ఉన్నారు.

## అంతర్‌గంగా దేవస్థాన కమిటీ ఎన్నిక



అమ్రాబాద్ అంతర్‌గంగా దేవాలయ నూతన కమిటీ

అమ్రాబాద్, జూన్ 23 : మండల కేంద్రానికి సమీపంలోని అంతర్‌గంగా దేవస్థానం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పదేండ్లుగా ఆలయ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న అమ్రాబాద్‌కు చెందిన పోల సత్యనారాయణను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఇద్దరు సభ్యులను ఎన్నుకొని నూతన కమిటీగా ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు వెంకటరమణ, జయమ్మ, ఆలయ పూజారి, వివిధ గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## గమ్యం చేరాలంటే గగనమే

- అడుగడుగునా మోకాల్లోతు గుంతలు
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



చారకొండలో గుంతలమయంగా ఉన్న రహదారి



మర్రిపల్లి వద్ద అధ్వానంగా మారిన రహదారి

చారకొండ, జూన్ 23: మోకాల్లోతు గుంతలు..రాళ్లు తేలి..రూపురేఖలు కోల్పోయిన రహదారులపై గమ్యస్థానాలకు చేరుకోవాలంటే గగనమే.. నిత్యం ప్రమాదాలతో ప్రాణసంకటంగా మారడంతో ప్రజలు ఆదేవన చెందుతున్నారు. మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలో భాగంగా మర్రిపల్లి నుంచి చారకొండ వరకు బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. జాతీర రహదారి కాంట్రాక్టర్లు బైపాస్ రోడ్డు పనులు నత్తనడకన నిర్లక్ష్యంగా చేస్తున్నారు. దీంతో మర్రిపల్లి నుండి చారకొండ వరకు దాదాపు మూడు కిలో మీటర్ల వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా అస్తవ్యస్తంగా ఉంది. వర్షం వస్తే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అడుగుకో గజం గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు గుంతలు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న ఇండ్లు వారు, దుకాణదారులు వాహనాల రద్దీ ఎక్కువ గా ఉండటంతో దుమ్ముతో రోగాల భారిన పడుతున్నామని వాపోతున్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్డుకు జాతీయ కాంట్రాక్టర్లు తాత్కలికంగా మట్టి పోసి చేతులు దులుపుకొంటున్నారు. భారీ వాహనాల రాకపోకలతో వర్షం వచ్చి మళ్లీ గుంతలమయంగా మారుతుంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చారకొండ నుంచి మర్రిపల్లి వరకు డబుల్ రోడ్డు వేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

### ఇండ్లలో ఉండలేక పోతున్నం



చారకొండ-మర్రిపల్లి వరకు రహదారి లోతైన గుంతలు ఏర్పడింది. మా ఇంటి ఎదుట రోడ్డు మొత్తంగా మోకాల్లోతు గుంతలు ఉండటంతో దుమ్ము వల్ల ఇంట్లో ఉండలేక పోతున్నం. ఆ దుమ్ము ఇండ్లలో చేరి రోగాల బారిన పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. తాత్కలికంగా మట్టి తీసుకొచ్చి పోసి మరింత దుమ్ము లేపుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ వేసి శాశ్వత పరిష్కారం చేయాలి. బీటీ రోడ్డు వేయకుంటే అందరిని కలుపుకొని రోడ్డుపై ధర్నాలు చేపడుతాం.

– ఉడతల మల్లమ్మ, చారకొండ

## విద్యుదాఘాతంతో దూడ మృతి

అమ్రాబాద్/చారకొండ, జూన్ 23 : విద్యుదాఘాతంతో దూడ మృతి చెందిన ఘటన పదరలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు కృష్ణయ్యకు చెందిన ఆవుదూడ గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని తెలిపారు. చారకొండ మండలం జూపల్లిలో బండ్ల లక్ష్మమ్మకు చెందిన గేదె ఆదివారం వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశుత్తుగా విద్యుత్ తీగ తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు. దీంతో పశువైద్యాధికారికి సమాచారం ఇవ్వడంతో పశువైద్య సిబ్బంది వచ్చి గేదెను పరిశీలించారు. గేదె విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.



మృతి చెందిన దూడ

## 25న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చారకొండ, జూన్ 23 : మండల కేంద్రంలో శ్రీలక్ష్మిపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25, 26వ తేదీ రెండు రోజుల పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. 25న భగవద్గీత పారాయణం, తీర్థ ప్రసాద వితరణ, 26న ధ్వజారోహణం, అర్చనలు, కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

కోడేరు, జూన్ 23 : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మపై పాశవికంగా దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని మండల సీపీఎం కార్యదర్శి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొలచింతలపల్లిలో గిరిజన మహిళ ఈశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన బండి శివుడు, బండి వెంకటేశ్ దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

## ఉపాధ్యాయులను నియమించాలి

తిమ్మాజిపేట, జూన్ 23 : మండలంలోని బావాజీపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని ఆదివారం కలిశారు. ఈ సంరద్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో యూపీఎస్ అభివృద్ధి కోసం కమిటీ ఏర్పడి, పాఠశాలలో మౌలిక వసతులు సమకూర్చుతున్నామని, ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఫలితంగా చాలామంది ప్రభుత్వ పాఠశాలలో చేరారని తెలిపారు. వందమంది విద్యార్థులకు ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని, అదనపు పోస్టులను మంజూరు చేసి నియమించాలని కోరారు. దీనిని ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎస్ఎంసీ సభ్యులు తెలిపారు.

## లెక్చరర్ల నియామకం చేపట్టాలి

పెద్దకొత్తపల్లి, జూన్ 23: పెద్దకొత్తపల్లిలోని జల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం ఆర్భాటంగా ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటికీ లెక్చరర్లు, సిబ్బంది నియామకాలు చేపట్టడం లేదని బీజేపీ మండలాధ్యక్షుడు బీమేశ్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో ఖండించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ తరగతులు ప్రారంభంకాలేదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత ఇంటర్మీడియట్ అధికారులు మంత్రి కృష్ణారావు విద్యాధికారులతో చొరవ తీసుకొని వెంటనే నియామకాలు చేపట్టి విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని పేర్కొన్నారు. నియామకాలు చేపట్టకపోవడంతో విద్యార్థులు కళాశాలలో ఎక్కువగా చేరడం లేదని, చేరిన విద్యార్థులకు న్యాయం చేసేందుకు త్వరగా తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## ముమ్మరంగా బీటీ పనులు



బిజినేపల్లిలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

బిజినేపల్లి, జూన్ 23 : మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ఆదివారం చేపట్టారు. గతంలో వేసిన రోడ్డు గుంతలుగా మారడంతో మరమ్మతు పనులను వేగవంతం చేశారు. మహబూబ్‌నగర్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే ప్రధాన రహదారిపై నూతనంగా రోడ్డు వేశారు. కాగా ఈ పనులను ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవి, ఏఈ వెంకటస్వామి పర్యవేక్షించారు.

## మైసమ్మను దర్శించుకున్న భక్తులు



మైసమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, జూన్ 23: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఇటీవల రైతులు తమ వ్యవసాయపొలల్ల పంటలు వేసుకోవడంతో అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఈ ఆదివారం మైసమ్మ దేవతకు ఆదాయం పెరిగినట్లు సిబ్బంది తెలిపారు.